
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు వరంగల్ ఎంపీ కడియం కావ్య సోమవారం పర్యటించనున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 11గంటలకు గోరికొత్తపల్లి మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారని, గణపురం మండలం చెల్పూరులో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. చెల్పూరులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మంత్రులు మాట్లాడుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భూపాలపల్లి భాస్కరగడ్డలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శిస్తారన్నారు. పాత ఎస్పీ కార్యాలయంలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ. కోటితో నిర్మించిన గ్రంథాలయాన్ని మంత్రులు, ఎంపీల చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. విలేకరుల సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, బుర్ర కొమరయ్య, అప్పం కిషన్, శిరుప అనిల్, ముంజాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చెల్పూర్, రేగొండలో ఏర్పాట్లు పూర్తి

గణపురం/రేగొండ (ఆంధ్రజ్యోతి): గణపురం, రేగొండ మండలాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్, పొన్నం ప్రభాకర్ పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గణపురం మండలం చెల్పూరులో బస్టాండ్ నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. రెండు మండలాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ నేపథ్యంలో అధికారులు సభా స్థలిని చదును చేసి వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.


లక్ష్యానికి బీటలు

> సర్కారు లక్ష్యం బీటలు వారింది. పది కాలాల పాటు 'పక్కా' కార్యాచరణతో పేదలకు సేవలు అందించేందుకు కట్టామంటున్న భవనం.. ప్రారంభోత్సవానికి ముందే పగుళ్ల బారిన పడింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని దుస్థితి ఇది.





250 పడకల ఆస్పత్రిలో పగుళ్లు ఏర్పడిన గోడలు



పగుళ్లబారిన పడుతున్న 250 పడకల ఆస్పత్రి

- రూ.45 కోట్ల వ్యయంతో మొదలైన నిర్మాణం
- ప్రారంభానికి ముందే దుర్గతి
- 'ఎయిర్ క్రాక్స్' మాత్రమే అంటున్న కాంట్రాక్టర్
- నాణ్యతా లోపమే అంటున్న నిపుణులు

భూపాలపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలోని 250 పడకల ఆస్పత్రిని రూ.45 కోట్లతో నిర్మిస్తున్నారు. 2022లో దీని పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా పూర్తి కాలేదు. అయితే.. ఈ భవనం ఇప్పటికే బీటలు వారుతోంది. గోడలు, బీమ్‌లు, పిల్లర్లు వేగంగా పగుళ్లబారిన పడుతున్నాయి. ఇది సాధారణ లోపాలా.. లేదా రానున్న ప్రమాదానికి సంకేతమా? అనే భయాందోళన వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్ మాత్రం ఇది ఎయిర్ క్రాక్ మాత్రమేనని కొట్టిపారేస్తున్నారు. నిపుణులు మాత్రం ఇవి తీవ్ర నిర్మాణ లోపం (స్ట్రక్చరల్ ఫెయిల్యూర్) అంటున్నారు. పునాదులు దెబ్బతినడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలుస్తోంది.

భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రిని 250 పడకలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం 2022లో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్, థౌజండ్ క్వార్టర్స్ సమీపంలో పనులు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం రెండేళ్లలోపు ఈ నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది. ఈ క్రమంలోనే జిల్లాకు మెడికల్ కాలేజీ కూడా మంజూరు చేయటంతో 2023 సెప్టెంబరులో వైద్య కళాశాలను తాత్కాలికంగా ఈ భవన సముదాయంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో అధికారుల ఒత్తిడితో కాంట్రాక్టరు హడావిడిగా పనులు చేసి కళాశాలకు భవనాన్ని అప్పగించారు. మిగిలిన పనులను 2024 మే నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు కాలేదు. ఈ క్రమంలోనే నిర్మాణ లోపాలు, నాణ్యత సమస్యల కారణంగా కళాశాల కొనసాగుతున్న భవన సముదాయంలో ప్రమాదకర రీతిలో గోడలు, పిల్లర్ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. ఇవి రోజు రోజుకూ విస్తరిస్తున్నట్టు తెలుస్తోంది. నిబంధల ప్రకారం నిర్మాణం పూర్తయిన తర్వాత రెండు సంవత్సరాల పాటు భవన నిర్వహణ బాధ్యతలను కూడా కాంట్రాక్టరే నిర్వహించాల్సి ఉంది. అయితే.. భవనాన్ని ఇంకా అప్పగించక ముందే గోడలు పగుళ్లు రావటం మొత్తం నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు లెవనెత్తుతున్నాయి. ఈ పగుళ్లకు ఎయిర్ క్రాక్స్ కారణమని కాంట్రాక్టర్ చెబుతున్నా నిపుణులు మాత్రం నిర్మాన లోపమే అంటున్నారు. ప్రస్తుతం ఈ భవనంలోనే తాత్కాలికంగా వైద్య కళాశాల తరగతులు కొనసాగుతున్న నేపథ్యంలో గోడలపై కనబడుతున్న పగుళ్లు రానున్న ప్రమాదాలకు సంకేతం కావచ్చని భావిస్తున్నారు. రెండేళ్లు కూడా పూర్తి కాక ముందే నాణ్యత సమస్యలు బయట పడటం పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు వెంటనే భవనం మొత్తాన్ని రీసర్వే చేసి సమస్యను పరిష్కరించకపోతే కోట్లాది రూపాయల ప్రజాధనం బురదలో పోసిన పన్నీరే అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పగుళ్లకు కారణాలు ఇవేనా..?

ఆస్పత్రి పగుళ్లు తేలేందుకు ప్రధానంగా పునాది సరిగ్గా వేయలేక పోవటమే కారణమనే అనుమానం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఫౌండేషన్ సరిగా లేక పోవటం వల్ల నేలకుంగిపోయి గోడలు పగుళ్లు బారుతాయని నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా సమానంగా లేని భూభాగంలో నిర్మాణ పనులను ఆదరా బాదరగా చేయటం వల్ల కూడా నేల సర్దు బాట్లు, కదలికల వల్ల గోడలు దెబ్బతింటాయంటున్నారు. ఇదిలా ఉంటే నిర్మాణంలో వాడే ముడి సరుకులు, సిమెంటు, ఇసుక మట్టి నాణ్యత సరిగ్గా లేక పోవటం వంటివి కూడా నాణ్యతను దెబ్బతిస్తాయంటున్నారు. ముఖ్యంగా సిమెంటు, ఇసుక మిశ్రమం నిష్పత్తి సరిగ్గా పాటించకపోవటం వల్ల కూడా గోడలు బలహీనంగా మారి పగుళ్లు తేలే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాగే నిర్మాణం సందర్భంగా తడి గోడలపై ఆదరాబాదరగా ప్లాస్టరింగ్ చేయటం, తర్వాత సమాయానుకూలంగా నీటి తడి అందించక పోవటం వంటి కారణాల వల్ల కూడా బలహీన పడుతుందని అంటున్నారు. ప్రస్తుతం ఈ భవనంలో పగుళ్లు తేలటం ఏయిర్ క్రాక్స్ కాక పోవచ్చని నిర్మాణ లోపాలే ముఖ్య పాత్ర పోషించి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వెంటనే స్ట్రక్చరల్ ఇంజనీర్ల ద్వారా రీసర్వే చేయించి పగుళ్లు తేలిన ప్రాంతంలో సమస్యకు కారణమేమిటో పరీక్షించాలని, ఆ ప్రాంతాల్లో ఏపోక్సి కెమెకల్స్‌తో గ్రౌటింగ్ చేసి పగుళ్లను పూడ్చి రొంత వరకు నష్టాన్ని నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

గనుల ప్రాంతం కావటం వల్లే..

నిర్మాణ సమయంలో వచ్చిన పగుళ్లు ఎయిర్ క్రాక్స్ మాత్రమే. మైనింగ్ ఎరియా కావటం వల్ల నిర్మాణాలు ఇలా పగుళ్లు తేలటం సహజమే. ఈ పగుళ్లు గనుల కారణంగానే పెద్దగా అభివృద్ధి చెందాయి. పనులు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం.

-రవి కిరణ్, ఏఈఈ

కొత్త ఠాణాకు 17 మంది సిబ్బంది

తొమ్మిది పోలీస్‌స్టేషన్ల నుంచి సర్దుబాటు చేసిన ఎస్పీ

కృష్ణకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఏర్పడిన కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్‌కు 17 మంది సిబ్బందిని నియమించారు. జిల్లా పరిధిలోని తొమ్మిది ఠాణాల్లో పనిచేస్తున్న వారిని సర్దుబాటు చేసి పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు ఎస్పీ కిరణ్ ఖరే చేపట్టారు. భూపాలపల్లి పీఎస్ నుంచి ఇద్దరు, రేగొండ పీఎస్ నుంచి ఆరుగురు, గుణపురం నుంచి ఇద్దరు, చిట్యాల నుంచి ఒకరు, మొగుళ్లపల్లి నుంచి ఇద్దరు, కాటారం పీఎస్ నుంచి ఒకరు, మహదేవపూర్ నుంచి ఒకరు, కొయ్యూరు నుంచి ఒకరు, కాళేశ్వరం పీఎస్ నుంచి ఒకరిని నిమించారు. మొత్తం 17 మందిని కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. వీరంతా సోమవారం నుంచి విధులు నిర్వర్తించనున్నారు.

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కేంద్ర కమిటీ ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా డీజీఎం గోళ్ల రమేష్



రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గోళ్ల రమేష్‌ను సన్మానిస్తున్న సింగరేణి గిరిజన ఉద్యోగులు

కృషకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. భూపాలపల్లిలోని సింగరేణి ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల నుంచి సుమారు 200 మంది పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గోళ్ల రమేష్ (డిప్యూటీ జనరల్ మేనేజర్-కొత్తగూడెం ఏరియా), ప్రధాన కార్యదర్శిగా భూక్య కృష్ణమూర్తి (ఫిట్టర్- భూపాలపల్లి ఏరియా) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా భూపాలపల్లి ఏరియా లైజన్ ఆఫీసర్ కల్లీ రమేష్ వ్యవహరించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయి పవన్ (కొత్తగూడెం ఏరియా), సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వాంకుడోతు శివ, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బొర్రా రాంబాబు (భూపాలపల్లి ఏరియా), ఉపాధ్యక్షులుగా ఇస్లావత్ దిలీప్‌కుమార్ (శ్రీరాంపూర్ ఏరియా), అంబి రాజు (ఆర్జీ1 ఏరియా), బాలు నాయక్ (కొత్తగూడెం ఏరియా), కరుణాకర్ (భూపాలపల్లి ఏరియా), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నాగేశ్వర్ నాయక్ (మణుగూరు ఏరియా), బి.భీమా (ఆర్జీ1 ఏరియా), బానోత్ తిరుపతి (మందమర్రి ఏరియా), జాయింట్ సెక్రటరీలుగా ఇరుప కృష్ణ (కొత్తగూడెం ఏరియా), బానోత్ చంద్రశేఖర్ (ఆర్జీ2 ఏరియా), కిరణ్ (ఆర్జీ 1 ఏరియా), జి.ప్రేమ్‌లాల్ (మందమర్రి ఏరియా), ట్రెజరీగా ప్రశాంత్, జాయింట్ సెక్రటరీగా ఎ. చంద్రయ్య (భూపాలపల్లి) ఏరియా ఎన్నికయ్యారు.

కాటారం మండలంలో భారీ వర్షం



పిడుగుపాటుకు విద్యుత్ స్తంభంపై ధ్వంసమైన ఇన్సులేటర్

కాటారం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా సరైన వర్షం కురవక ఆందోళన చెందుతున్న రైతులకు ఊరట కలిగింది. సుమారు 6 సెం.మీ వర్షాపాతం నమోదైంది. అదే విధంగా ఈ వర్షానికి పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేలల్లోకి వర్షపు నీరు వచ్చింది. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ వరద చేరింది. కాటారం-మంథని రహదారిపై బుడగజంగాల కాలనీలో వర్షపు నీరు చేరింది. అలాగే పిడుగుపాటుకు పలు విద్యుత్ స్తంభాలపై ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాలకు కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు వెంటనే విద్యుత్ పునరుద్ధరణ చేశారు. మరో రెండు మూడు భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు దుముకుతాయని, వ్యవసాయ పనులు ముమ్మరమవుతాయని రైతులు అంటున్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక నేతలు

కాటారం, జూలై 20(ఆంధ్రజ్యోతి): దండకారణ్యం నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టడానికి కుట్ర పన్ని పోలీసులు చేస్తున్న దాడులను ఆపాలని ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక రాష్ట్ర నాయకులు ముడిమడుగుల మల్లన్న, దాముక లక్ష్మణ్, రత్నకుమార్, బాలసాని రాజయ్య డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న మారణకాండను నిలిపివేయాలని అన్నారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న కాటారం మండల కేంద్రంలో తలపెట్టిన బహిరంగసభ సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. నాయకులు మాట్లాడుతూ దండకారణ్యంలోని వేల కోట్లాది రూపాయల విలువైన అటవి, ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్రం రెండున్నర దశాబ్దాలుగా వివిధ రకాల పేర్లతో పలు ఆపరేషన్స్ నిర్వహిస్తోందని విమర్శించారు. వేదిక నాయకులు గుమ్మడి కొమురయ్య, రామిళ్ల బాపు, టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్, యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, ఆదివాసీ నాయకులు సుంకరి మల్లేష్, రాజేందర్, శంకర్, మధునయ్య ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి 90,240క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీరు దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నది 1.95 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.



గోదావరి వద్ద భక్త జనం

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఆదివారం భక్తజనం పోటెత్తారు. ఆషాడ మాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానదదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు.



ఇల్లు లేదు.. ఇంటి స్థలం లేదు.. అని గ నిర్ధారించిన సర్వే పత్రం

సెలెక్ట్.. రిజెక్ట్

- బెంబేలెత్తుతున్న 'డబుల్ బెడ్‌రూం' లబ్ధిదారులు
- మంజూరు చేసిన వెంటనే రద్దు చేశారని ఆందోళన
- అర్హతలున్నా అన్యాయమేనని ఆగ్రహం
- పంపిణీ చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరిక

6

బీసీ జోష్

- సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో భారీగా సీట్ల కేటాయింపు
- జడ్పీ చైర్మన్‌లు, ఎంపీపీల్లో పెరగనున్న ప్రాతినిధ్యం
- గత ఎన్నికల్లో 22 శాతమే రిజర్వేషన్
- అయినా జనరల్ స్థానాల్లో ఓసీలను ఢీకొట్టిన బీసీలు
- ఈసారి రిజర్వేషన్ల పెంపుతో వెల్లివిరుస్తున్న ఆనందం

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం కోటా



2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీసీల ప్రాతినిథ్యం ఇలా

	వరంగల్	హనుమకొండ	జనగామ	మానుకోట	భూపాలపల్లి	ములుగు
గ్రామ పంచాయతీలు	325	210	281	461	240	150
బీసీ రిజర్వుడు	48	46	39	22	51	06
మొత్తం బీసీలు నెగ్గినవి	63	68	95	67	100	29
మొత్తం ఎంపీటీసీలు	134	130	128	198	102	72
బీసీ రిజర్వుడు	35	30	17	05	23	25
మొత్తం బీసీలు నెగ్గినవి	53	63	55	37	43	26
మొత్తం జడ్పీటీసీలు	11	12	12	16	11	08
బీసీ రిజర్వుడు	01	03	01	00	02	02
మొత్తం బీసీలు నెగ్గినవి	05	05	01	02	04	03

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఈసారి స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం లభించనుంది. 2019లో జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో 22శాతంగా ఉన్న రిజర్వేషన్‌ను ప్రభుత్వం ఈసారి ఆర్డినెన్స్ ద్వారా 42 శాతానికి పెంచుతోంది. దీంతో బీసీలకు స్థానికంలో ప్రాధాన్యత డబుల్ కానుంది. కులగణన నివేదక ప్రకారం రాష్ట్ర జనాభాలో 56.33 శాతం బీసీలు ఉన్నారని తేలింది. దీంతో కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు బీసీ సంఘాల నేతల డిమాండ్‌కు అనుగుణంగా 42శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మునిసిపల్ ఎన్నికల్లో ఇప్పుడున్న వాటికి అదనంగా బీసీలకు 20శాతం రిజర్వేషన్లను పెంచి 42శాతం అమలు చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 36,46,955 మంది జనాభా ఉండగా, ఇందులో బీసీలు 14,28,043మంది (40 శాతం) ఉన్నట్లుగా గుర్తించారు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనలో 45శాతానికి పైగా ఉన్నట్లు సమాచారం. పదేళ్లలో బీసీల జనాభా నాలుగు నుంచి

(మిగతా 8లో..)

మైసమ్మ తల్లికి డిప్యూటీ స్పీకర్ మొక్కులు



అలియాబాద్ మైసమ్మ తల్లికి పట్టు వస్త్రాలను తీసుకెళుతున్న డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్

మరిపెడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అలియాబాద్ దర్బార్ మైసమ్మ తల్లికి ఆదివారం డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆ ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బోనాల పండుగ సందర్భంగా రాంచంద్రునాయక్ మైసమ్మతల్లికి పట్టువస్త్రాలు సమర్పించి నైవేద్య బోనం చెల్లించుకున్నారు. మైసమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాంచంద్రు నాయక్ వెంట ప్రభుత్వ రాజకీయ సలహాదారు హర్కర వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ నేత పులి అనిల్, పలువురు నాయకులు ఉన్నారు.

30 వరకు ప్రీ పీహెచ్‌డీ ఫీజులు చెల్లించాలి

కేయూ క్యాంపస్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్, సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, కామర్స్, లా, ఎడ్యుకేషన్ విభాగాల్లో ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజును జూలై 30వ తేదీ వరకు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో ఆగస్టు 7 వరకు చెల్లించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. 2021-22 ఏడాదిలో రెండో, మూడో జాబితాలో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు కూడా ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజును చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అభ్యర్థులకు నిర్వహించనున్న పరీక్షల తేదీలను తర్వాత ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్ల కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్ల నూతన కార్యవర్గం

నర్సంపేట టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఆదివారం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, అధ్యక్షుడిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి, కార్యదర్శిగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లఅండలు శ్రీరామ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నర్సంపేట, చేర్యాల, స్టేషన్‌ఘన్‌పూర్, ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు పాలాయి శ్రీనివాస్, నల్లనాగుల శ్వేతవెంకటాచారి, జూలకంటి లావణ్యశిరీ్షరెడ్డి, సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సెలెక్ట్.. రిజెక్ట్



లబ్ధిదారులకు కేటాయించనున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- బెంబేలెత్తుతున్న 'డబుల్ బెడ్‌రూం' లబ్ధిదారులు
- మంజూరు చేసిన వెంటనే రద్దు చేశారని ఆందోళన
- అర్హతలున్నా అన్యాయమేనని ఆగ్రహం
- పంపిణీ చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరిక

భూపాలపల్లిటౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వాళ్లందరూ నిలువ నీడ లేని నిరుపేదలు. కూలినాలి చేసి పొట్ట నింపుకొనే అభాగ్యులు. రెండు దశాబ్దాలక్రితం భూపాలపల్లికి వలస వచ్చారు. వీరి వద్ద ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. స్థానిక నిరుపేదలు అనడానికి వీరు అన్నిరకాల ఆధారాలు కలిగి ఉన్నారు. ఈ క్రమంలో వీరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించడానికి ప్రత్యేక కమిటీ ద్వారా అధికారులు సర్వేలునిర్వహించారు. వారిని అర్హులుగా సెలెక్ట్ చేశారు. అయితే.. ఉన్నపళంగా అర్హులు కాదని పలువురిని జాబితా నుంచి తొలగించారు. మొత్తం 416 మందిలో సుమారు 200 మందిని లిస్టు నుంచి రిజెక్ట్ చేయడం విమర్శలకు తావిస్తోంది. వీరిని ఎందుకు తొలగించారో.. వీరి స్థానంలో మరికొంత మందికి కేటాయించడంలో ఆంతర్యం ఏమిటో తెలియడం లేదు. ఈ నేపథ్యంలో నష్టపోతున్న లబ్ధిదారులు బెంబేలెత్తిపోతున్నారు. మునిసిపల్ కార్యాలయం వద్ద శనివారం నిరసనకు దిగారు.

విచ్చలవిడిగా డబ్బుల వసూలు!

పలువురు లబ్ధిదారుల వద్ద నీకు ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, నీకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరైందని కొంతమంది చోటామోటా నాయకులు కాలనీల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరి వద్ద సుమారు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. కొంతమంది కార్యకర్తలు రూ.10వేలు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందుగా ఎంపిక.. ఆ తర్వాత తొలగింపు

భూపాలపల్లి పట్టణంలోని వివిధ కాలనీల్లో నివసించే ఇంటి స్థలం, ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం గృహాలు మంజూరు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను అర్హులకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఆయా కాలనీలలో సర్వేలు నిర్వహించి అర్హుల జాబితాను తయారు చేసింది. అయితే.. పట్టణానికి సమీపంలోని కేటీకే 5వ గని దగ్గర 416 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎంపిక చేసుకుంది. అయితే... ఇదివరకే ఎన్నికల సమయంలో గత ప్రభుత్వ హయాంలో హడావిడిగా పలువురికి ఇళ్లు కేటాయించారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అధికారులు పాత వాటిని పూర్తిగా రద్దు చేసి మళ్లీ సర్వేలు చేసి అర్హులకే ఇస్తామని చెప్పారు. ఈ క్రమంలో సర్వేలు జరిగాయి. 416 ఇళ్లకు గాను లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు ఒక లిస్ట్ తయారు చేశారు. అయితే ఉన్నపళంగా ఆ జాబితాలో ఉన్న సుమారు 200 మందికి పైగా పేర్లను తొలగిస్తూ వేరొకరికి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు లబ్ధిదారులకు తెలిసింది. ఈ క్రమంలో శనివారం మునిసిపల్ కార్యాలయం వద్దకు వచ్చి తమకు ఇచ్చిన సర్వే పత్రాలను చూపించి నిరసన తెలిపారు. అలాగే మునిసిపల్ అధికారులను అడిగారు. ఈ క్రమంలో అధికారులు తమకు ఏమీ తెలియదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము పనిచేస్తున్నామని తెలిపారని బాధితులు చెప్పారు. ఇదే విషయమై కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చినట్లే ఇచ్చి లాక్కోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద దరఖాస్తుదారుల నిరసన (ఫైల్)

అంతా గందరగోళమే..

మొదటగా సాధారణంగానే లబ్ధిదారులను గుర్తించిన అధికారులు ఇప్పుడు కొత్తగా మూడు విభాగాలను ఏర్పాటు చేశారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. అసలు సమస్య ఇక్కడే మొదలైంది. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని వారు ఎల్-1గా, ఇంటి స్థలం, ఇల్లు లేని వారిని ఎల్-2గా, అలాగే ఇంటి స్థలం, ఇల్లు ఉన్న వారిని ఎల్-3గా విభజించారు. అయితే సాధారణంగా ఎల్-2లో ఉన్న అర్హులకు మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇక్కడ ఎల్-1, ఎల్-3లో ఉన్న వారిని కూడా అర్హులుగా పేర్కొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదేమిటంటే.. పాత ఇల్లు కూలిపోయే దశలో ఉందని, ఇంటిస్థలం ఉన్నవారు కట్టుకోలేని దుస్థితిలో ఉన్నారని సర్దిచెబుతూ వారికి మంజూరు చేసినట్టు విమర్శలు వస్తున్నాయి. దీంతో అర్హుల ఎంపికలో గందరగోళం నెలకొందని పలువురు చెబుతున్నారు.

అందరికీ ఒకేసారి వీలుకాదు..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు కోసం భూపాలపల్లి పట్టణం నుంచి సుమారు 2వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఉన్నవి 416 ఇళ్లు మాత్రమే. వీటిని ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీలను నియమించాం. అవి సూచించిన మేరకు అర్హులైన వారికే ఆ ఇళ్లు ఇస్తాం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. తమకు రాలేదని వాపోతున్న వారు కూడా అర్హులే కావచ్చు. కానీ అందరికీ ఎలా సాధ్యమవుతుంది?

– విజయలక్ష్మి, అదనపు కలెక్టర్

అవి హైనా పాదముద్రలు

మల్హర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ నుంచి తాడిచర్లకు వెళ్లే అటవీ మార్గంలో గుర్తించిన పాద ముద్రలు హైనాకు చెందినవిగా ఫారెస్టు అధికారులు తెలిపారు. మండల ప్రజలు ఎవరూ హైరానా చెందాల్సిన అవసరం లేదన్నారు. పులి పాదముద్రల ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గ్రామస్థులు భయాందోళనకు గురికావద్దని సూచించారు.

సూదనపల్లిలో యువకుడి ఆత్మహత్య



నగేష్ (ఫైల్)

కురవి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన నాగబోయిన నగేష్(26) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకుని మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న నగేష్ మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడని, మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. నగేష్ మృతితో తల్లి దండ్రులు వీరన్న,యాదమ్మలు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, నగేష్ మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

స్పోర్ట్స్ స్కూల్‌పై ఆకర్షిస్తున్న 'సిత్రాలు'



కొత్తగూడ స్పోర్ట్స్ స్కూల్‌లో గోడలపై వేసిన చిత్రాలు



కొత్తగూడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలోని ఐటీడీఏ స్కూల్ స్పోర్ట్స్ భవనాలపై సిత్రాలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. స్పోర్ట్స్ పాఠశాల ఆధునీకరణలో భాగంగా అధికారులు భవనాలపై పలు క్రీడల చిత్రాలను చిత్రకారులతో వేయించారు. పాఠశాల భవనంపై బాస్కెట్‌బాల్, డార్మెటరీ భవనంపై క్రికెట్, డైనింగ్ హాల్‌పై ఫుట్‌బాల్ క్రీడా చిత్రాలను వేయించారు. విద్యార్థులు చిత్రాలను చూస్తూ ప్రేరణ పొందుతారని, క్రీడల్లో రాణిస్తారని హెచ్‌ఎం సారయ్య, డిప్యూటీ వార్డెన్ పెనుక ప్రభాకర్, సామాజిక వేత్త, ఉపాధ్యాయుడు డాక్టర్ వాసం వీరాస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

- నీళ్లు విడుదల చేయకపోతే సీఎం ఇంటి ముందు ధర్నా చేస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వానలు లేక.. గోదావరి జలాలు రాక.. సాగునీటి కోసం పాలకుర్తి నియోజకవర్గంలోని రైతులు అరిగోస పడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల్లో గోదావరి జలాలు విడుదల చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు పెద్ద ఎత్తున రైతులతో ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ పాలనలో పాలకుర్తి నియోజకవర్గంతో పాటు రాష్ట్రం సస్యశ్యామలంగా ఉన్నదన్నారు. రైతులు వద్దనేంత వరకు గోదావరి జలాలతో చెరువులు నింపానని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో చెరువులు మత్తళ్లు దూకాయన్నారు. గోదావరి జలాలతో చెరువులు నింపడంలో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు ప్రణాళిక లేదన్నారు. రైతుల కోసం పాదయాత్ర చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు వక్రీకరించడం వాళ్ల మూర్ఖత్వానికి నిదర్శనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు కష్టాలు మొదలయ్యాయని, నీటిని విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం వల్లే రైతుల పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులకు మాటలు తప్ప చేతలు సాధ్యం కావడం లేదన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక మూడున్నరేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజా పాలన కాదని, పేద ప్రజలను దోచే పాలన నడుస్తున్నదని తెలిపారు. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలు గాలిలో కలిశాయని, ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం పోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క నియోజకవర్గం కూడా అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, ఆ పార్టీ దొంగ హామీలను ప్రజల్లో ఎండగట్టేది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. అలాగే చిట్యాల, బొమ్మకల్ గ్రామాల్లో ఇటీవల పలువురు మరణించగా మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం మాజీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్, కేతిరెడ్డి సోమనర్సమ్మ, రెడ్డి వెంకన్న, రాంమూర్తి, భిక్షపతి, బుజ్జమ్మ, యాకయ్య, అనిల్, అనుదీప్, సతీష్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు కాయిన్ బాక్స్ ఫోన్



మరిపెడలోని ఓ కిరాణ దుకాణం దగ్గర ఏర్పాటు చేసి కాయిన్ ఫోన్

మరిపెడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 2010కి ముందు షాపుషాపుకి కనిపించిన కాయిన్ బాక్స్ ఫోన్ ఆ తర్వాత కనుమరుగైంది. కాయిన్ ఫోన్ చూద్దామన్నా 15 ఏళ్ల నుంచి కనిపించలే. ఇప్పుడు మళ్లీ మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఓ కిరాణం షాపు నిర్వాహకుడు కాయిన్ బాక్స్ ఫోన్ తన దుకాణం ముందు ఏర్పాటు చేశారు. ఈ కాయిన్ ఫోన్ చూసి ప్రజలు ముచ్చటించుకుంటున్నారు. దశాబ్దంన్నర కిందటి పాత జ్ఞప్తులను గుర్తుచేసుకుంటూ మళ్లీ కాయిన్‌బాక్స్ ఫోన్ వచ్చిందని నిరుపేదలు మురిసిపోతున్నారు. కాయిన్ బాక్స్ ఫోన్‌తో పేదలు, విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. టెలికాం సంస్థలు టారిఫ్‌లు పెంచడంతో సెల్ వినియోగదారులు సైతం కాయిన్ బాక్స్ ఫోన్ వైపు ఆకర్షితులవుతున్నారు. ఆ దుకాణానికి సమీపంలో హాస్టల్ విద్యార్థులు తమ ఇళ్లకు రూపాయి కాయిన్ బాక్స్‌లో వేసి ఫోన్ చేసుకుంటున్నారు. ఇదివరకు ఎవరైనా సెల్‌ఫోన్‌తో కనిపిస్తే విద్యార్థులు అంకుల్ అంకుల్ అంటూ ఒక్కసారి ఫోన్ ఇయ్యవా ఇంటికి ఫోన్ చేసుకుంటా అంటూ వేడుకోనేవారు. ఈ కాయిన్ బాక్స్ ఫోన్ ఏర్పాటుతో హాస్టల్ విద్యార్థులకు ఫోన్ కష్టాలు దూరమయ్యాయని పరిసర ప్రాంత ప్రజలు అంటున్నారు.

మరిపెడలో భారీ వర్షం



కుండపోతగా కురుస్తున్న వర్షం

మరిపెడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మరిపెడలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సంతకు వచ్చిన వ్యాపారులు, కొనుగోలుదారులు గంట పాటు వర్షానికి ఉక్కిరి బిక్కిరి అయ్యారు. అంగడికి తెచ్చిన సరకులన్నీ తడిసి ముద్దయ్యాయి. పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్గిల్ సెంటర్, రాంవిలాస్ గల్లీ, ఇందిరానగర్, సేవనగర్, కండక్టర్స్ కాలనీలోని ప్రజలు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

చిట్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రామచందర్ మాదిగ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వికలాంగులకు రూ.6వేలు, వితంతువులకు రూ.4వేలు పెన్షన్ ఆగస్టు నుంచి అందించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి రానున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా కోఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్, సీనియర్ నాయకులు ఓదెల, భిక్షపతి, తిరుపతి, సురేష్, భద్రయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడి నియామకం

ఎమ్మార్పీఎస్ అనుబంధ దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా నవాబుపేటకు చెందిన సాద రమేష్‌ను నియమించారు. ఉపాధ్యక్షులుగా మునీర్, జేరిపోతుల ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా అన్నారపు రమణకుమార్, కార్యదర్శిగా చిలువేరు రవీందర్‌ను ఖరారు చేశారు.

నిరుపయోగంగా పోస్టుమార్టం గది

- నిలిచిపోయిన పోస్టుమార్టం సేవలు
- సిబ్బంది, వైద్యుల కొరత



తొర్రూరులో నిరుపయోగంగా ఉన్న పోస్టుమార్టం గది

తొర్రూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన తొర్రూరులో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పోస్టుమార్టం గది వృథాగా పోతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి దయాకర్ రావు కరోనాకు ముందు రూ.10లక్షల నిధులు కేటాయించగా నిర్మాణం చేపట్టారు. దానిలో కొన్ని రోజుల పాటు పోస్టుమార్టం నిర్వహించారు. గత కొంత కాలంగా పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రానికి, వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై ప్రమాదాలు తీవ్రంగా జరుగుతున్నాయి. క్షతగాత్రులు అంతదూరం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పోస్టుమార్టం నిర్వహణకు ఫోరెన్సిక్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పోస్టుమార్టం చేసేందుకు పరికరాలు, మెడిసిన్ అవసరం ఉంటాయి. కానీ, అధికారులు సరఫరా చేయకపోవడం, సిబ్బంది లేక సేవలు నిలిచిపోయాయి. తొర్రూరుకు వంద పడకల ఆస్పత్రి మంజూరైనా అది నిర్మాణం కాకపోవడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోనే భవనాన్ని నిర్మించారు. స్థానిక వైద్యులకు నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాయిజన్, ఇతర కేసులకు మాత్రమే స్థానిక డాక్టర్‌లు పోస్టుమార్టం చేసేవారు. కానీ, ఇప్పుడు సరైన వైద్యులు లేకపోవడంతో పోస్టుమార్టం సేవలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సేవలు కొనసాగించాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు. స్థానిక వైద్యులను వివరణ కోరగా పోస్టుమార్టం సేవల కొనసాగింపునకు ఉన్నతాధికారులకు నివేదిక అందించామని, సాధ్యమైనంత వరకు కేసులను చేస్తున్నామన్నారు.

పోస్టుమార్టం సేవలు అందించాలి

రామగిరి భాస్కరాచారి, తొర్రూరు

ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించి పోస్టుమార్టం గదిని నిర్మిస్తే సేవలు అందించకపోవడం సరికాదు. ఖమ్మం, వరంగల్ ప్రధాన రహదారిపై ఉన్న తొర్రూరుకు ప్రతీ రోజు 50 నుంచి 60వేల మంది నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తారు. రద్దీగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోస్టుమార్టం గది ఉండి సేవలు అందించకపోవడం బాధాకరం. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తొర్రూరులో పోస్టుమార్టం సేవలు అందే విధంగా చర్యలు చేపట్టాలి.

ఎడ్లబండ్లు ఏడబాయే!

- సాగులో యాంత్రీకరణ ప్రభావం
- రోజురోజుకు పశువుల తగ్గుముఖం
- ట్రాక్టర్ల రాకతో వడ్రంగి పరికరాలు కనుమరుగు


నల్లబెల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బండెనక బండికట్టి పదహారు బండ్లు కట్టి.. అని పాడుకుంటూ.. రైతులు జోడెడ్ల బండితో వ్యవసాయ పనులు హుషారుగా చేసేవారు. తొలకరి వర్షం కురవడంతో పంట భూములు పచ్చగా చిగురు వచ్చేవి. నాటి పశువుల కేరింతలతో రైతులు మురిసిపోయేవారు. కానీ, నేడు రైతుల రథం జోడెడ్ల బండ్లు కనుమరుగైపోయాయి.

ఇంటి ముందు కానరాని జోడెడ్లు

ఇంటి ముందు జోడెడ్లు, ఎడ్ల బండి ఉంటే రైతులు ఆభరణాలుగా భావించేవారు. రైతులు వ్యవసాయ పనులకు పనిముట్లు, ఎరువులు, పంటను తరలించేందుకు ఎడ్లబండ్లను ఉపయోగించేవారు. రోజురోజుకు వాటి వినియోగం తగ్గిపోయింది. రైతుల ఇంటి ముందు రాజహంసల ఉండే బండ్లు నేడు కానరావడం లేదు. రైతుల జీవితంలో మమేకమై వారికి చైతన్య రథంలా సేవలందించిన ఎడ్లబండ్లు నేడు కనిపించకుండా పోయాయి. నాడు మండలాల్లో, డివిజన్లలో ఎడ్ల పోటీలు పండుగలకు పెట్టేవారు. పోటీల్లో గెలుపొందిన జోడెడ్లకు బహుమతులు ఇచ్చేవారు.

బండ్లుపోయే.. ట్రాక్టర్లు వచ్చే..

ప్రతీ గ్రామంలో ట్రాక్టర్లు వచ్చేశాయి. వ్యవసాయ పనులకు ఉపయోగపడుతున్నాయి. దీంతో చాలా సమయం ఆదా అవుతుంది. రైతులు ఎడ్లబండ్లను పక్కన పెట్టి ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. రైతులు టేకు కలపను తీసుకువచ్చి వడ్రంగితో వ్యవసాయ పనిముట్లు చేయించుకునేవారు. ట్రాక్టరు ద్వారా చేసే వ్యవసాయ పనులతో పెట్టుబడులు ఎక్కువ అవుతుండడంతో ఒకప్పటి ఎడ్ల బండ్లను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.



కనిపించని ఆనాటి వైభవం

వ్యవసాయ పనుల్లో మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో క్రమేణ యాంత్రీకరణ పెరిగింది. ఎడ్ల పోషణ రైతులకు కష్టంగా మారింది. వాటిని పెంచలేక రైతు కష్టాల్లో కూరుకుపోయాడు. దీంతో ఎడ్ల బండ్లు మూలనపడ్డాయి. నాడు ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో ఉన్న బండ్లు, నేడు ఒకటి లేదా రెండు కనిపిస్తున్నాయి. నేడు అవి కూడా మూలనపడే అవకాశం ఉంది. నాడు ఎడ్ల బండ్లు, పశువులు లేనివారు కిరాయి మాట్లాడుకొని వ్యవసాయ పనులు చేసుకునేవారు.

ఇప్పుడన్నీ యంత్రాలతోనే పనులు

అజ్మీరా తిరుపతినాయక్, రైతు, రుద్రగూడెం



ఇప్పుడన్నీ యంత్రాలతోనే వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. నాడు తక్కువ ఖర్చుతో పశువులు, ఎడ్ల బండ్లతో వ్యవసాయం చేసేవాళ్లం. నేడు ప్రతీ పనికి యంత్రాల అవసరం ఎక్కువైంది. వ్యవసాయ పనికి పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. నేటి కంటే నాటి వ్యవసాయమే బాగుండేది. నాటి వ్యవసాయానికి జోడెడ్లు, బండ్లు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కాలక్రమేణా ఎడ్ల బండ్లు, పశువులు తగ్గిపోవడం బాధాకరం.

రైతులకు అవసరమైన యంత్రాలు ఇవ్వాలి

బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, రైతు, కన్నారావుపేట



జోడెడ్లు తగ్గిపోవడంతో, నేడు రైతులకు యంత్రాలతో వ్యవసాయ పనుల అవసరం పెరిగింది. దీంతో రైతులకు పెట్టుబడి భారం మరింత పెరిగింది. ప్రభుత్వం రైతులకు యంత్రాల కొనుగోలుకు రాయితీ ఇవ్వాలి. పంటలకు సరైన గిట్టుబాటు ధరను కల్పించాలి. ప్రభుత్వం రైతులకు ఎరువులను అందించడంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలి. అలాగే రైతులకు ఉపయోగపడే యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలి.



కాటారం అటవీ ప్రాంతంలో భోజనాలు చేస్తున్న ప్రజలు

వన భోజనాల సందడి

కాటారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ఆదివారం వనభోజనాల సందడి కనిపించింది. పలు వాడలకు చెందిన వందలాది మంది వనభోజనాలకు తరలివెళ్లారు. మండల కేంద్ర శివారులో 353(సీ) జాతీయ రహదారి పక్కన అటవీప్రాంతానికి పలు కుటుంబాలు వంటలకు వెళ్లి సామూహిక భోజనాలు చేశారు. వరుణుడు కరుణించి వానలను సమృద్ధిగా కురిపించి పంటలు బాగా పండేలా చూడాలంటూ ప్రతి ఏటా వన భోజనాలకు తరలివెళ్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ప్రజలతో కలిసి పలు పార్టీలకు చెందిన నాయకులు విందు, వినోదాలతో సందడి చేశారు. భోజనాల అనంతరం యువకులు, పిల్లలు డీజే పెట్టుకుని డ్యాన్సులు చేశారు.

మంగపేట మండలంలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రజలు వనభోజనాలకు వెళ్లారు. ఉదయాన్నే చేరుకొని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వంటలు వండుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

శాంతిభద్రతలపై సర్కారు ఫోకస్

- భూపాలపల్లి జిల్లాకు కొత్త ఠాణా, కొత్త సర్కిల్ మంజూరు
- నేడు ప్రారంభించనున్న మంత్రులు
- పరిశీలనలోనే ఉమెన్, ట్రాఫిక్, సైబర్ పీఎస్‌లు

కృష్ణకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై కాంగ్రెస్ సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలానికి కొత్త ఠాణా మంజూరుతో పాటు కొత్తగా సర్కిల్ ఏర్పాటుకు గెజిట్ విడుదల చేసింది. భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 12 పోలీస్‌స్టేషన్లు ఉండగా.. మూడు సర్కిళ్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ఠాణాతో జిల్లాలో ఠాణాల సంఖ్య 13కు చేరుకుంది. అలాగే, సర్కిళ్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. అయితే, ఇంకా జిల్లా కేంద్రానికి మంజూరు కావాల్సిన ఉమెన్, ట్రాఫిక్, సైబర్ ఠాణాలు ప్రతిపాదనల్లోనే ఉన్నాయి.

కొత్త పోలీస్ స్టేషన్, కొత్త సర్కిల్

భూపాలపల్లి జిల్లాలోని రేగొండ మండలంలోని గ్రామంగా ఉన్న కొత్తపల్లిగోరి గ్రామాన్ని ప్రభుత్వం మండలంగా మార్చింది. దీంతో ఆ మండలంలో కొత్తగా ఠాణా మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నేడు (సోమవారం) మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్, ఎస్పీలు నిమగ్నమయ్యారు. ఇక జిల్లాలో ప్రస్తుతం మహదేవపూర్, కాటారం, చిట్యాల సర్కిళ్లు ఉన్నాయి. చిట్యాల సర్కిల్‌ను రెండుగా విభజించి పరిపాలన దృష్ట్యా గణపురం కేంద్రంగా చిట్యాల సర్కిల్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడనున్న గణపురం సర్కిల్ పరిధిలో గణపురం, రేగొండ, కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్లు ఉండనున్నాయి.

పరిశీలనలో మరో మూడు ఠాణాలు

భూపాలపల్లి 2016 అక్టోబరు 11న జిల్లాగా అవతరించింది. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో ఇప్పటి వరకు దాదాపు కావాల్సిన ఠాణాలన్నీ ఏర్పాటయ్యాయి. కానీ, భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాత్రం ప్రధానంగా ఇంకా మూడు ఠాణాలు ఏర్పాటు కావాల్సి ఉంది. జిల్లా కేంద్రంగా మారడంతో ఈ ప్రాంతానికి రోజురోజుకు వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఠాణా అత్యంత అవసరమైంది. ఏడాదిన్నర కిందట ఎస్పీ కిరణ్‌ఖరే చొరవతో తాత్కాలికంగా ట్రాఫిక్ ఠాణా ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. కానీ, అధికారికంగా ఠాణా మంజూరుకు గెజిట్ విడుదల కాలేదు. అలాగే మహిళల సమస్యల పరిష్కారానికి ఉమెన్ ఠాణా సైతం ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పోలీస్‌స్టేషన్లలో మహిళా పోలీసు అధికారులు లేక మహిళలు వారికి ఎదురయ్యే సమస్యలను పురుష పోలీసులకు చెప్పుకోలేక మథన పడుతున్నారనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో మహిళా ఠాణా ఏర్పడితే జిల్లా పరిధిలోని మహిళలు, యువతులకు ఆమోదయోగ్యంగా ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు ఇక రోజురోజుకు సైబర్ నేరాలు సైతం జిల్లాలో మితిమీరుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సైబర్ ఠాణాలను కేవలం కమిషనరేట్ పరిధుల్లోనే ప్రారంభిస్తుండగా.. జిల్లాలో అత్యధికంగా సైబర్ మోసాలు జరుగుతున్న దృష్ట్యా ప్రత్యేకంగా సైబర్ ఠాణా అవసరమని పోలీస్ యంత్రాంగం గుర్తించింది. కొన్నేళ్ల కిందటే ఈ మూడు ఠాణాల ఏర్పాటుకు పోలీస్‌శాఖ ప్రతిపానలు పంపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ఈ ఠాణాల ఏర్పాటుపై నిర్లక్ష్యం వహించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి.



మంత్రులు ప్రారంభించనున్న కొత్తపల్లిగోరి తాత్కాలిక పోలీస్‌స్టేషన్

మంత్రులు హామీ ఇచ్చేనా ?

నేడు జిల్లాకు ముగ్గురు మంత్రులు వస్తున్న దృష్ట్యా జిల్లా కేంద్రంలో అవసరమయ్యే మూడు ఠాణాలపై మంత్రులు మాట ఇచ్చేనా ? అనే చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం ఠాణాల ఏర్పాటులో తాత్సారం చేయగా.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకింత దృష్టి సారించి కొత్త మండలానికి అతి తక్కువ సమయంలోనే కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, నూతన సర్కిల్ మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఈ తరుణంలో ప్రతిపాదనల్లో ఉన్న ఈ మూడు ఠాణాలను సైతం త్వరగా మంజూరు చేసేలా దృష్టి సారించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ నెల 21న ముగ్గురు మంత్రులు జిల్లాకు రానున్నందున కొత్త ఠాణా ప్రారంభ వేదికలోనే ఈ మూడు ఠాణాల మంజూరుకు హామీ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

రద్దీగా వన దేవతల గద్దెలు

10 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు

తాడ్వాయి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. వనదేవతలకు భక్తులు సంస్కృతి, సంప్రదాయాల్లో పూజలు చేసి దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గద్దెలకు చేరుకున్నారు. ఎత్తు బంగారం(బెల్లం), కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరెలు, సారెలు సమర్పించారు.

హేమాచలంలో భక్తుల సండే సందడి

మంగపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో వారంతపు సెలవు దినం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 20 వేల మంది భక్తులు దేవాలయానికి చేరి చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. ఉప దేవాలయాల్లో దేవుళ్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ, ప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టత, స్వామివారి చరిత్రను వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అర్చక, ఉద్యోగులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

బస్తీ దవాఖానాలేవి ?

- జనాభాకనుగుణంగా ఏర్పాటులో నిర్లక్ష్యం
- పదివేల జనాభాకు ఒకటి ఉండాలి
- ఉమ్మడి జిల్లాలో ఉన్నవి తొమ్మిది మాత్రమే
- ప్రతీ మునిసిపాలిటీలో గరిష్ఠంగా ఐదు ఏర్పాటు చేయాలి

హనుమకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన బస్తీ దవాఖానాల ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా మురికివాడల్లో నివసించే నిరుపేదలు, గుడిసెవాసులు వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి గానీ, అర్బన్ హెల్త్ సెంటర్లకుగానీ రావలసిన అవసరం లేకుండా వారికి అందుబాటులో ఉండేలా ప్రతీ పది వేల జనాభకు ఒక బస్తీదవాఖానా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్దేశం బాగానే ఉన్నా ఆచరణే లేదు.

బస్తీ దవాఖానాలు తొమ్మిదే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన మూడు మునిసిపాలిటీలను కలుపుకొని మొత్తం 12 ఉన్నాయి. మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి, జనగామతో పాటు కొత్త మున్సిపాలిటీలు ములుగు, కేసముద్రం, స్టేషన్ ఘనపూర్ వీటిలో ఉన్నాయి. వీటికితోడు వరంగల్ మహానగర పాలక సంస్థ ఉన్నది. ప్రతీ పదివేల జనాభాకు ఒకటి చొప్పున బస్తీదవాఖానాను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ప్రకారం కొత్తవాటిని మినహాయిస్తే పాత తొమ్మిది మునిసిపాలిటీశలో గరిష్ఠంగా 5 నుంచి 6 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పది లక్షలకుపైగా జనాభా కలిగిన వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో డివిజన్‌కు ఒకటి చొప్పున 68 ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఇందుకు భిన్నంగా లక్ష జనాభాకు ఒకటి చొప్పున కూడా ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. వరంగల్ కార్పొరేషన్‌తో కలుపుకొని ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో మొత్తంగా 9 బస్తీ దవాఖానాలే ఏర్పాటయ్యాయి. వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 2 వరంగల్‌లో, 3 హనుమకొండలో నెలకొల్పారు. 5 లక్షలకుపైగా జనాభా కలిగిన జనగామ మునిసిపాలిటీ పరిధిలో, 4 లక్షలకు పైగా జనాభా కలిగిన మహబూబాబాద్ పురపాలికలో ఒకటి చొప్పున, భూపాలపల్లి మునిసిపాలిటీలో 2 ఏర్పాటయ్యాయి.

మందుల లేమి

బస్తీ దవాఖానాలకు వచ్చే రోగులకు మందులు సరిగా అందుబాటులో ఉండడం లేదు. ప్రభుత్వం అందజేస్తున్న మందులు 15 రోజులకు మాత్రమే సరిపోతున్నాయని, మిగతా రోజుల్లో రోగులు స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లు, లేదా పీహెచ్‌సీలకు వెళ్లి తీసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నారు. దీంతో పలుమార్లు రోగులకు, సిబ్బందికి మధ్య తరుచూ వాగ్వాదాలు జరుగుతున్నాయి. ప్రతీ బస్తీదవాఖానాకు ఒక డాక్టర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు సహాయకులు, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక ఫార్మసిస్టును నియమించాలని రోగులు కోరుతున్నారు.



జనగామ మునిసిపాలిటీ పరిధిలోని బస్తీ దవాఖానా

సిబ్బంది కొరత

బస్తీదవాఖానాలో ఓ మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్స్, ఒక సహాయకుడు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలి. కాని ఎక్కడ కూడా పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీరు వైద్య సేవలు అందించాలి. కాని వారు సమయపాలన పాటించ డంలేదు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, టీకాలు వేయడం లాంటి 57 రకాల వైద్య సేవలు అందించాలి. అంతకు మించిన ఆరోగ్య సమస్య లు, అత్యవసర చికిత్సలకు ఇతర ప్రభుత్వ దవాఖానాలకు రెఫర్ చేయా లి. కానీ సిబ్బంది కొరత కారణంగా ఎక్కడా అమలు కావడం లేదు.

సేవలు అంతంత మాత్రమే..

ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లో ప్రస్తుతం ఉన్న బస్తీ దవాఖానాల ద్వారా వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరైన సిబ్బంది లేకపోవడం, మందులు కూడా సరిగా ఇవ్వకపోవడం వల్ల ఈ దుస్థితి తలెత్తుతోంది. బస్తీ దవాఖానాలకు ప్రతీ రోజు 60 నుంచి 70 మంది రోగులు వస్తుంటారు. వారికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులను అందించాలి. ఈ ప్రక్రియను పూర్తిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలి. అనంతరం 3 గంటల లోపు వివరాలను ఆన్‌లైన్ డేటాలో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ సరైన డాటా ఎంట్రీ సిబ్బంది, పరిపడా నర్సులు లేరు.

ఆరు పురపాలికల్లో అసలే లేవు

తొర్రూరు, మరిపెడ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల, డోర్నకల్ పురపాలికల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా ఏర్పాటు కాలేదు. వరంగల్‌లో మూడు బస్తీ దవాఖానాలు మంజూరు కాగా స్థలం అందుబాటులో లేదన్న కారణంతో రెండింటినే ఏర్పాటు చేశారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలకు ఉప కేంద్రాలు లేకపోవడంతో పురపాలికలోని అన్ని డివిజన్ల ప్రజలకు వైద్య సేవలు అందడం కష్టంగా మారింది. కొన్ని మురికివాడలు, కాలనీలు పట్టణానికి దూరంగా ఉండగా వీరు ఎక్కువగా జిల్లా కేంద్రానికి రావలసి వస్తోంది. లేదా సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళుతున్నారు. దీంతో రోగుల తాకిడి ఎక్కువై గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. వానా కాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశముంది. పురపాలికల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకలు చాలకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

పాఠశాలల్లో వృత్తి విద్యా బోధన

- ఇప్పటికే 10 పాఠశాలల్లో అమలు
- మరో 8 పాఠశాలల్లో పీఎంశ్రీ
- విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి

జనగామ కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ- 2020) ప్రకారం పాఠశాల విద్యార్థుల్లో అనుభవపూర్వక నైపుణ్యాలను పెంపొందించడానికి ఫుల్ టైమ్ వృత్తి విద్య కోర్సులు బోధించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జనగామ జిల్లాలో సమగ్రశిక్ష ద్వారా 10 పాఠశాలల్లో ఈ కోర్సులు బోధిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా జిల్లాలో నూతనంగా 8 పాఠశాలల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభిస్తున్నారు. ప్రతి పాఠశాలలో రెండు వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తారు. 9, 10 తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ కోర్సులను బోధిస్తారు. వృత్తి విద్యను ప్రధాన స్రవంతి పాఠ్యాంశాలకు అనుసంధానించి సెకండరీ స్థాయిలో 9, 10 తరగతులకు సబ్జెక్టుగా, ఇంటర్‌లో తప్పనిసరి సబ్జెక్టుగా అందిస్తారు.

కొత్తగా అమలు చేస్తున్న పాఠశాలలు

వృత్తి విద్యా కోర్సులను ఇప్పటికే 10 పాఠశాలల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా పీఎంశ్రీ పథకంలో కొత్తగా మల్కాపూర్, ఘన్‌పూర్, ధర్మకంచ, తరిగొప్పుల, కూనూరు, పాలకుర్తిలోని జడ్పీహెచ్‌ఎ స్‌లు, చౌడారంలోని కేజీబీవీ, జఫర్‌గఢ్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ (బాలికలు), మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, అసిస్టెంట్ ప్లంబర్, సీయింగ్ మిషన్ ఆపరేటర్, హెమ్ హెల్త్ ఎయిడ్ ట్రైనీ కోర్సులను అమలు చేస్తున్నారు.



బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న లింగాల ఘణపురం మోడల్ స్కూల్ విద్యార్థులు

ఒకేషనల్ ల్యాబ్‌ల ఏర్పాటు

కోర్సులకనుగుణంగా పూర్తి వనరులతో ఒకేషనల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. అర్హత, అనుభవం ఉన్న ఇద్దరు వృత్తి విద్యా బోధకులను నియమిస్తారు. విద్యార్థులు వారికి ఇష్టం ఉన్న కోర్సులో చేరవచ్చు. కోర్సు చివరలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలతో పాటు ఫీల్డ్ సందర్శన ఉంటుంది. ప్రతి సంవత్సరం విద్యార్థులకు అన్ని సబ్జెక్ట్లలాగే ఈ కోర్సులకూ ఫైనల్ పరీక్షలు నిర్వహించి సెకండరీ బోర్డు, సంబంధిత సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సంయుక్తంగా వృత్తి విద్యా సర్టిఫికెట్‌ను జారీ చేస్తాయి. ఈ సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లు నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా వృత్తిపరమైన కోర్సులను అందిస్తాయి. విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలను మదింపు చేస్తాయి. ల్యాబ్‌ల నిర్వహణ, పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల ఫీల్డ్ సందర్శనకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

వృత్తి విద్య ప్రధాన లక్ష్యాలు

విద్యార్థులకు నైపుణ్య ఆధారిత శిక్షణ అందించి ఉపాధిని పెంచడం. పరిశ్రమ అవసరాలు, విద్యా వ్యవస్థ మధ్య అంతరాన్ని తగ్గించడం. విద్యార్థులు స్వయం ఉపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం. విద్యార్థుల డ్రాపౌట్లను తగ్గించడం. రోజువారి పాఠశాల విద్య అభ్యసనలో వెనుకబడుతున్న విద్యార్థులకు ప్రత్యామ్నాయ విద్యను అందించి వారిలో మార్కెట్ ఆధారిత నైపుణ్యాలు పెంచడం.

నైపుణ్యాభివృద్ధికి వృత్తి విద్య దోహదం

బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో




దేశంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో 41 శాతం వృత్తి విద్య అధ్యయనం తమ నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని భావిస్తున్నట్లుగా ఒక సర్వేలో తేలింది. ఆచరణాత్మక శిక్షణతో విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడుతుంది. వృత్తి విద్య అభ్యసన, ఆవశ్యకత ప్రధానమైనదిగా ఎన్‌ఈపీ-2020 గుర్తించింది. 2030 లోగా అన్ని ఉన్నత పాఠశాలల్లో వృత్తి విద్యను భాగం చేయాలని నిర్ణయించింది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు వృత్తి విద్యపై ఆసక్తిని పెంచుకొని, నైపుణ్యం సాధించినప్పుడు భవిష్యత్తులో పలు రంగాల్లో స్థిరపడి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు.

వృత్తి కోర్సుల బోధనకు ఏర్పాట్లు చేశాం..

డి.భోజన్న, డీఈవో, జనగామ



సమాజంలో వృత్తి విద్య నిపుణులకు ప్రాముఖ్యత పెరిగింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం విడతల వారీగా పాఠశాలల్లో వృత్తి విద్య బోధనను ప్రవేశపెడుతుంది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 10 పాఠశాలలకు తోడుగా ఈ సంవత్సరం కొత్తగా 8 పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులను బోధించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఆ పాఠశాలల హెచ్‌ఎంలు కోర్సులపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పేరెంట్స్ తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలి.



బీమా.. ధీమా

- అన్నదాత కుటుంబానికి ఆర్థిక భరోసా
- జిల్లాల్లో 1,585 మందికి రైతు బీమా
- ఏడేళ్లలో 77.20 కోట్ల చెల్లింపులు
- పథకం పరిధిలోకి 40,365 మంది





ములుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా అన్నదాత కుటుంబాలకు భరోసానిస్తోంది. కుటుంబ పెద్ద దిక్కు దురదృష్టవశాత్తు మరణిస్తే అతడి కుటుంబం సభ్యులు ఆర్థికంగా కుంగిపోకుండా ఈ పథకం ఆసరాగా నిలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం ములుగు జిల్లాలోని రైతు కుటుంబాలకు ధీమా కల్పిస్తోంది. 2018లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి 1585 మంది రైతులు మరణించగా ఒక్కో కుటుంబానికి రూ. 5లక్షల చొప్పున 1,544 మంది కుటుంబాలకు రూ.77.20 కోట్లు బీమా పరిహారం చెల్లించినట్లు వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు తెలిపారు. మిగిలిన 41 మందికి సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి చెల్లిస్తామని అంటున్నారు.

రైతు బీమా పరిధిలో 40,365 మంది రైతులు

జిల్లా వ్యాప్తంగా 86,736 మంది రైతులు రైతు బీమా పథకం పరిధిలో ఉన్నారు. అయితే 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు ఉండి పట్టాదారు పాస్‌పుస్తకం కలిగి ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ప్రతి ఆగస్టు 14 నుంచి తరవాతి సంవత్సరం ఆగస్టు 13 వరకు వర్తించేలా ఈ పథకం అమలు చేస్తారు. కటాఫ్ తేదీ పరిధిలోకి వచ్చే నాటికి నూతన పట్టా పాస్ పుస్తకాలు కలిగి ఉన్న రైతుల పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు 59 సంవత్సరాలు నిండిన వారు, మరణించిన వారి పేర్లను తొలగిస్తారు. 2025 జూలై నాటికి ఈ పథకానికి 40,365 మంది రైతులకు అర్హత ఉందని జిల్లా వ్యవ సాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతు బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు.

మండలాల వారీగా లబ్ధి ఇలా..

జిల్లాలో 2024 ఆగస్టు 14 నుంచి 2025 జూలై 19 వరకు 246 మంది రైతులు వివిధ కారణాలతో మరణించారు. వీరిలో 205 మంది రైతుల కుటుంబాలకు బీమా సొమ్ము ముట్టింది. మిగిలిన 41 మంది కుటుంబాలకు పలు కారణాలు, చిన్న చిన్న సమస్యల వలన బీమా సొమ్ము అందలేదని సమస్య పరిష్కారమైన వెంటనే చెల్లిస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే బీమా సొమ్ము అందాల్సిన వారి వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. ఏటూరునాగారం మండ లంలో 27 మంది రైతులు మరణించగా 23 మంది కుటుం బాలకు రూ. 1.15 కోట్ల బీమా సొమ్ము అందింది. ఇంకా నలుగురికి రూ.20 లక్షలు అందాల్సి ఉంది. గోవిందరావుపేట మం డలంలో 18 మంది రైతులు మరణించగా 13 మంది కుటుంబ సభ్యులకు రూ.65లక్షలు అందించారు. మిగిలిన ఐదుగురు కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షలు అందాల్సి ఉంది. కన్నాయి గూడెం మండలంలో 15 మంది మర ణించగా 12 మంది కుటుంబ సభ్యులకు రూ. 60 లక్షల బీమా సొమ్మును అందించి మరో మూడు కుటుంబాలకు రూ. 15లక్షలు పెండింగ్‌లో ఉంచారు. మంగపేట మండలంలో 32 మంది రైతులు మరణించగా రూ.1.45 కోట్ల బీమా సొమ్ము 29 మంది కుటుంబాలకు అందించి మరో మూడు కుటుంబాలకు రూ. 15లక్షలు ఇవ్వాల్సి ఉంది. ములుగు మండలంలో 54 మంది అన్నదాతలు మరణించగా 45 మంది కుటుంబాలకు రూ. 2.25 కోట్ల బీమా సోమ్మును చెల్లించారు. మిగిలిన 9 మంది కుటుంబాలకు రూ. 45 లక్షలు చెల్లించాల్సి ఉంది. తాడ్వాయి మండలంలో 25 మంది రైతులు మరణించగా 21 మంది కుటుంబాలకు 1.05 కోట్లు చెల్లించారు. మిగిలిన నాలుగు కుటుంబాలకు రూ. 20 లక్షల రైతు బీమా సొమ్ము అందాల్సి ఉంది. వెంకటాపూర్ మండలంలో 28 మంది రైతులు మరణించగా 19 మంది కుటుంబాలకు రూ. 95 లక్షల ఆర్థిక సహాయం అందింది. మరో 9 మంది కుటుంబాలకు రూ. 45లక్షల రైతు బీమా అందాల్సి ఉంది. వాజేడు మండలంలో 22 మంది రైతులు మరణించగా రూ. కోటి బీమా సొమ్మును వారి కుటుంబాలకు అందించారు. మరో రెండు కుటుంబాలకు రూ. 10 లక్షలు అందాల్సి ఉంది. వెంకటాపురం మండలంలో 25 మంది రైతులు మరణించగా 23 మంది రైతుల కుటుంబ సభ్యులకు రూ. 1.15 కోట్లు చెల్లించారు. మరో రెండు కుటుంబాలకు రూ. 10 లక్షల రైతు బీమా సొమ్ము అందాల్సి ఉంది. అయితే బీమా సొమ్ము క్లైమ్ చేయాలంటే ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకంలో వివరాలు ఒకేలా ఉండాలని అధికారుల చెబుతున్నారు. అలా లేకపోవడంతో మిగిలిన 41 మంది రైతులకు బీమా సొమ్ము నిలిచి పోయింది. ఈ సమస్యను పరిష్కరించి వారి కుటుంబాలకు రైతు బీమా సొమ్ము అందేలా చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాల్లో 1,585 మందికి..

రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకం అమలు పరుస్తున్నప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా 1,585 మంది రైతులు మరణించారు. ఇందులో 2018లో 149 మంది మృతి చెందగా వారి కుటుంబాలకు రూ. 7.45 కోట్లు బీమా పరిహారాన్ని అందించారు. 2019లో 166 మంది మరణించగా రూ. 8.30 కోట్ల చెల్లించారు. 2020లో 290 మంది అసువులు బాయగా రూ. 14.50 కోట్లు అందజేశారు. 2021లో 223 మంది రైతులు మరణించగా రూ. 11.15 కోట్ల పరిహారం చెల్లించారు. 2022లో 222 మంది మరణించగా రూ. 11.10 కోట్లు చెల్లించారు. 2024 నుంచి 2025 జూలై వరకు 246 మంది రైతులు మరణించగా 205 కుటుంబ సభ్యులకు రూ. 10.25 కోట్లు అం దించారు. మరో 41 మంది బాధిత రైతు కుటుం బాలకు రైతు బీమా సొమ్ము అందించాల్సి

సమస్యలతో సహవాసం ఇంకెన్నాళ్లు?

- ఏడు దశాబ్దాలుగా పట్టా కోసం రైతుల నిరీక్షణ
- హామీలకే పరిమితమైన బస్టాండ్ నిర్మాణం
- మంత్రుల పర్యటన నేపథ్యంలో చిగురిస్తున్న ఆశలు



రేగొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో దీర్ఘకాలికంగా కొన్ని సమస్యలు ప్రజల సహనాన్ని పరీక్షిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా నాయకులు హామీలు ఇస్తున్నా పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది పరిస్థితి. కొత్తపల్లిగోరి మండలానికి తాత్కాలిక పోలీస్‌స్టేషన్ ప్రారం భోత్సవానికి వస్తున్న మంత్రులు ఇప్పటికైనా ఆ సమస్యలపై దృష్టి పెడతారనే ఆశలు ప్రజల్లో రేకెత్తిస్తున్నాయి.

ఏడు దశాబ్దాలుగా రైతులకు ఎదురుచూపులు

నిజాం నవాబుల కాలంలో కొత్తపల్లిగోరి మండల కేంద్రంగా పరిపాలన సాగించిన మహమ్మద్ గోరిసాబ్ జాగీరుదారుగా పని చేశారు. ఆ సమయంలో 7వేల ఎకరాల భూమిని తన పేరుపై నమోదు చేసుకున్నట్లు గ్రామస్థులు చెబుతారు. ఆయన తదనంతరం ఆజంగోరి జాగీరుదారుగా పని చేశారు. ఆజంగోరి మరణానంతరం సులేమాన్‌గోరి జాగీరుదారుగా పని చేసే క్రమంలో భూములను తన పేరిట చేసుకున్నారు. 1961 సంవత్సరంలో కౌలు రైతు రక్షణ చట్టం ప్రకారం 2,100 ఎకరాలను పట్టా చేయించారు. ఇంకా పట్టాకాలంలో వేల ఎకరాలు గోరిసాబ్ పేరు మీదనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పట్టా పాస్‌పుస్తకాలు అందజేస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. ఇప్పటికైనా దృష్టి పెట్టి కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, గాంధీనగర్, జంషెడ్‌బేగ్‌పేట రైతులకు పట్టా పాస్ బుక్కులు అందేలా చూడాలని ప్రజలు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరుతున్నారు.

15 ఏళ్లుగా హామీకే పరిమితమైన బస్టాండ్ నిర్మాణం

రేగొండ మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం అనేది కలగానే మిగిలిపోతోంది. పరకాల భూపాలపల్లి జిల్లా కేంద్రం, రేగొండ నుంచి ములుగు జిల్లా కేంద్రం, రేగొండ నుంచి చిట్యాల, టేకుమట్ల మండల కేంద్రాలకు ప్రయాణించే వారికి రేగొండ కేంద్ర బిందువుగా ఉంటుంది. వందల మంది ప్రయాణికులు రేగొండ మండల కేంద్రంలో బస్సులు మారి ప్రయాణం చేస్తుంటారు. ఈ క్రమంలో ఎంతో మంది ఎండనక, వాన అనక అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల అవసరాలు గుర్తించి నాయకులు బీఆర్ఎస్ మొదటిసారి ప్రభుత్వం ఏర్పడిన సమయంలో అప్పటి స్పీకర్ మధుసూదనాచారి బస్టాండ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రెండోసారి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించారు. స్థలం దొరకకపోవడంతో ప్రతిపాదన అంతటితోనే ఆగిపోయింది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రూ. 4 కోట్లతో బస్టాండ్ నిర్మాణం మంజూరైందని, సోమవారం మంత్రుల చేత శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయం పక్కన స్థలాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం శుభ్రం కూడా చేయించారు. ఇంతలోనే ఏం జరిగిందో తెలియదు కానీ మంత్రులతో శంకుస్థాపన మాత్రం నిలిచిపోయింది. దీంతో బస్టాండ్ నిర్మాణం అనేది కలగానే మిగిలిపోతుందా? అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బస్టాండ్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీసీ జోష్

5వ పేజీ తరువాయి

ఐదు శాతం పెరిగినట్లుగా అంచనా. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాలు పట్టుబడుతుంటంతో ఆర్డినెన్స్ ద్వారా బీసీల డిమాండ్‌ను తీర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

2019లో జనరల్ స్థానాల్లో బీసీల హవా

గత 2019 లోకల్‌బాడీ ఎన్నికల్లో 34శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను గత ప్రభుత్వం 22శాతానికి కుదించింది. 50శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదనే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లను కుదించాల్సి వచ్చింది. అయినప్పటికీ అనేక మంది జనరల్ స్థానాల్లో విజయం సాధించి బీసీలు సత్తా చాటారు.

అప్పట్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,688గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో బీసీలకు 212 సర్పంచ్ స్థానాలు రిజర్వుడు చేశారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో బీసీలకు 22శాతం కాకుండా, అక్కడ జనాభా అధారంగా ఎస్టీలకు అధికంగా సీట్లు దక్కాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో బీసీల సీట్లకు కోత పడింది. అయినప్పటికీ రిజర్వేషన్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో సైతం బీసీలు పోటీ చేసి విజయం సాధించారు. మొత్తం 1,688 స్థానాల్లో 422 సీట్లలో బీసీలు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. ములుగు జిల్లాల్లో 150 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే బీసీలకు కేవలం ఆరు జీపీలే రిజర్వు అయ్యాయి. అయినప్పటికి జనరల్ స్థానాల్లోపోటీ చేసి 29మంది బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 22శాతం రిజర్వేషన్ల కంటే అదనంగా 200స్థానాల్లో బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తంగా 25.5శాతం సీట్లు బీసీల పరం అయ్యాయి.

ఎంపీటీసీ స్థానాల్లోనూ బీసీలు జనరల్ స్థానాల్లో పాగా వేశారు. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 792 స్థానాలు ఉండగా, బీసీలకు 114 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు అయ్యాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అదనంగా మరో 163 స్థానాల్లో విజయం సాధించారు. మొత్తం 277స్థానాల్లో బీసీలు ఎంపీటీసీలుగా ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 198 ఎంపీటీసీ స్థానాలు ఉంటే కేవలం బీసీలకు 5స్థానాలే రిజర్వేషన్ చేశారు. కానీ, మరో 32 జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ఫలితంగా ఆ జిల్లాలో మొత్తం 37మంది బీసీలు ఎంపీటీసీలుగా విజయం సాధించారు. మొత్తంగా 35శాతం ఎంపీటీసీ సీట్లను బీసీలు కైవసం చేసుకున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70 జడ్పీటీసీలు ఉండగా, 9 జడ్పీటీసీలే బీసీలకు రిజర్వు అయ్యాయి. అయితే జనరల్ స్థానాల్లో పోటీ చేసి మరో 11స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. మొత్తంగా 20 మంది బీసీలు జడ్పీటీసీలుగా ఎన్నికయ్యారు. కోటా కంటే అదనంగా 29శాతం మంది బీసీలు జడ్పీటీసీలుగా విజయం సాధించారు. గిరిజన ప్రాబల్యం ప్రాంతం కావటంతో మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా రిజర్వు కాలేదు. అయినప్పటికీ జనరల్ స్థానాల్లో పోటి చేసి ఇద్దరు బీసీ అభ్యర్థులు విజయం సాధించారు. వరంగల్ జిల్లాలో 11 జడ్పీటీసీ స్థానాలు ఉంటే బీసీలకు ఒకటే స్థానం రిజర్వు చేశారు. ఇక్కడ మరో నాలుగు జనరల్ స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక జడ్పీ చైర్మన్ పదవి బీసీలకు దక్కింది. ములుగు జడ్పీ సీటు జనరల్‌కు కేటాయించినప్పటికీ ఏటూరునాగారం జడ్పీటీసీగా గెలిచిన కుసుమ జగదీష్‌కు చైర్మన్ పదవి దక్కింది. అయితే పూర్తికాలం పదవిలో కొనసాగలేదు. గుండెపోటుతో 2023 జూన్‌లో మృతి చెందారు.

లోకల్‌బాడీలో పెరుగనున్న బీసీల ప్రాతినిధ్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్‌లను కల్పించేందుకు ఇప్పటికే కేబినెట్ ఆమోదం పొందిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. గవర్నర్ ఆమోద ముద్ర పడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీంతో గతం కంటే 20శాతం అధికంగా సీట్లు రానున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 జడ్పీటీసీ, ఎంపీపీలు ఉన్నాయి. వీటిలో కనీసం 30 వరకు బీసీలకు రిజర్వుడు అయ్యే అవకాశం ఉంది. ఆరు జడ్పీ చైర్మన్‌లల్లో ఒకటిరెండు సీట్లు బీసీలకు రిజర్వు కోటాలో దక్కే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. 778మంది ఎంపీటీసీ స్థానాలు, 1,708 గ్రామపంచాతీల్లో మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో మినహా ఇతర జిల్లాల్లో భారీగా సీట్లు బీసీలకు రిజర్వు కానున్నాయి. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో స్థానిక సంస్థల్లో మొత్తం 2,550 పదవులు ఉండగా, అందులో ఈసారి అత్యధిక స్థానాలు బీసీలకు దక్కే అవకాశం ఉంది.

బాధిత కుటుంబాలకు మధు పరామర్శ



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న పుట్టు మధు

మల్హర్, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు కిషన్‌రావుపల్లి, గాధంపల్లిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. తాడిచర్ల గ్రామానికి చెందిన తాండ్ర జక్కమ్మ మృతి చెందగా మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. తాడిచర్ల గ్రామానికి చెందిన ఓదెలు, అలిమ్, కిషన్‌రావుపల్లిలో రామయ్య, గాధంపల్లిలో భూధమ్మ కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాగేశ్వర్‌రావు, మధుసూధన్‌రావు, మొగిళి, మార్కు, సతీష్, నవీన్, లక్ష్మన్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్

కృష్ణకాలనీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా రొడ్డ రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం టిప్పర్ లారీ యజమానులంతా సమావేశమైన నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ పెద్దలు శ్రీరాములు, రాములు, నర్సింహారెడ్డి సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

చిట్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కంకణాల రమేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం, వంట సామగ్రి, రూ. 8వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొండ కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు కాట్రేవుల కుమార్, యూత్ మండల ప్రధానకార్యదర్శి ఏరుకొండ రఘు, నాయకులు అంబాల రాజు, భాస్కర్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

కాటారం, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపును టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ ఆధ్వర్యంలో పలువురు మహిళా కాంగ్రెస్ నేతలు సన్మానించారు. బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాటారం డివిజన్ పరిధిలోని గ్రంథాల యాలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ బండెల సత్యమ్మ, కాంగ్రెస్ నేతలు కుంభం పద్మ, కామిడి వెంకట్‌రెడ్డి, కొట్టె శ్రీశైలం, కొట్టె శ్రీహరి, జనార్దన్ తదితరులు ఉన్నారు.

చిన్నారికి చేయూత

కాటారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ గ్రామానికి చెందిన బోడ శ్రీధర్ కూతురు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా స్నేహితులు, గ్రామస్థులు చేయూతనందించారు. చెందిన శ్రీధర్ ఆర్థిక స్థోమతను చూసిన మిత్రులు, గ్రామపెద్దలు పలువురు ముందుకొచ్చి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో రూ.73,400 ఆర్థికసాయంగా అందించారు. పలువురు ధన్వాడ యువకులు పాల్గొన్నారు.

తాడిచర్లలో గోరింటాకు వేడుక



గోరింటాకు వేడుకలో మహిళలు

మల్హర్, జూలై 19(ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రమైన తాడిచర్లలోని వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం మహిళలు గోరింటాకు వేడుక నిర్వహించారు. గోరింటాకు తెంచుకొని వచ్చి మొత్తగా నూరుకొని గౌరీదేవిని పూజించి చేతులకు పెట్టుకున్నారు. ఆషాడంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మ వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చన్నారు. పాటు శరీరంలోని వేడిని తగ్గించే శక్తి ఉంటుందని వారు తెలిపారు. ఈ వేడుకలో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కంటైనర్ లారీ



పక్కకు దూసుకెళ్లిన కంటైనర్ లారీ

వాజేడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఐరన్‌లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన బోడగుట్ట వద్ద కంటైనర్ లారీ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. మలుపు వద్ద డ్రైవర్ అదుపు చేయలేక ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్, క్లీనర్ లారీ నుంచి దూకి సురక్షితంగా బయటపడ్డారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదాపురం గ్రామ శివారుల్లో ఆదివారం స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా మండల కేంద్రానికి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి పంపించారు. తనిఖీల్లో ప్రొబేషనరీ ఎస్సై సాయికృష్ణ, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌని అంజయ్య మృతి తీరని లోటు

కల్లుగీత కార్మిక సంఘం



అంజయ్య చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నేతలు

తాడ్వాయి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కల్లుగీత కర్మిక సంఘం నాయకుడు గౌని అంజయ్య మృతి తీరని లోటని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్ అన్నారు. గౌని అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మండల కేంద్రంలో సంతాప సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడుతూ గౌని అంజయ్య స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల సమస్యలు, హక్కుల కోసం పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వార్దెల్లి వెంకన్నగౌడ్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, రంగు సత్యంగౌడ్, మొక్క రాజుగౌడ్, మొక్క దుర్గయ్యగౌడ్, అన్నపురం రాజుగౌడ్, చెవుగాని అంజనేయులు గౌడ్, రఘుగౌడ్, గుండు శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూరవీడులో ఘనంగా బోనాల పండుగ

వెంకటాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరవీడు గ్రామంలో ప్రజలు ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి నైవేద్యం వండారు. అనంతరం మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ఈసంద ర్భంగా పాడిపంటలు సమృద్ధిగా పండాలి, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో ఉండా లని వేడుకున్నారు. అనంతరం కార్యక్రమం నిర్వహించిన రిటైర్డు అధికారి ఆవుల సత్య నారాయణ దంపతులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన రిటైర్డు అధికారి ఆవుల సత్యనారాయణ, హేమలత, కిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముక్కుడు పోశమ్మకు మొక్కులు

మంగపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోమటిపల్లి శివారులో ముక్కుడు పోశమ్మ, నాగులమ్మ, పోతురాజు దేవాలయాల ఆవరణంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. యాటపోతులు, గొర్రెలు, మేకలను బలిచ్చి నైవేద్యంగా సమర్పించారు.

గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్య



రాములు (ఫైల్)

మంగపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై టీవీఆర్. సూరి తెలిపిన వివరాల ప్రకారం., మండలంలోని కమలాపురం వడ్డెరకాలనీకి చెందిన బుర్సు రాములు(36) కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య మందలించగా మనస్తాపం చెంది గడ్డి మందు తాగాడు. దీంతో ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ రాములు మృతి చెం దాడు. మృతుడి తల్లి అయిలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి భార్య నర్సమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కాంతమ్మ

ములుగు టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ జగ్గన్నపేట గ్రామ అధ్యక్షురాలిగా వంక కాంతమ్మను ఆదివారం ఎన్నికున్నారు. ఈ మేరకు మండల అధ్యక్షురాలు గుంటోజు పావని, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిట్టల రాధిక, కార్యదర్శి అల్లూరి సంధ్య తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా రౌతు రమ, ప్రధాన కార్యదర్శిగా బుర్క సరస్వతి, కార్యదర్శిగా దేవిరెడ్డి జయలక్ష్మి, కోశాధికారి గణగం రజిత, అధికార ప్రతినిధిగా ఎడ్డే వీరమ్మ, సహాయ కార్యదర్శిగా బోంతల శ్రీలతను ఎన్నుకున్నారు.